'పది' పరీక్షలు ప్రారంభం

- ముందే కేంద్రాలకు చేరిన విద్యార్థులు
- కుణ్ణంగా పరిశీలించి హాలులోకి పంపిన అధికారులు


పైడిమాంబ ఆలయంలో హాల్ టికెట్లతో పూజలు


శాంతినగర్ శ్రీచైతన్య కళాశాల వద్ద పరీక్షకు హాజరైన విద్యార్థులు


బాలాజీ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను పరిశీలిస్తున్న సిబ్బంది

గోపాలపట్నం: పశ్చిమ నియోజక వర్గ పరిధిలోని నిర్వహించిన పదో తరగతి పరీక్షలు తొలిరోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. పలు కేంద్రాలకు ఉదయం 8 గంటలకే విద్యార్థులు హాజరయ్యారు. బుచ్చిరాజుపాలెం పైడిమాంబ ఆలయంలో కొందరు విద్యార్థులు తల్లిదండ్రులతో హాల్ టికెట్లకు ప్రత్యేక పూజలు చేశారు. గోపాలపట్నం పరిధిలో 9 పరీక్ష కేంద్రాల్లో 1757 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. గోపాలపట్నం బాలుర పాఠశాలలో పరీక్ష కేంద్రంలో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం సమయంలో డీఈవో చంద్రకళ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

తల్లిదండ్రులతో కలిసి.

మల్కాపురం: పరీక్ష సమయానికి గంట ముందే విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసిసెంటర్లకు చేరుకున్నారు. తమ హాల్ టికెట్ నెంబర్ ప్రకారం ఏ గది కేటాయించారో నోటీస్ బోర్డులో పరిశీలించుకున్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని ఐదు సెంటర్లలో 1200 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు వచ్చారు.మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల,గాంధీగ్రామ్ జీవీఎంసీ పాఠశాల,శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల,శ్రీహరిపురం భాష్యం,సరస్వతి విద్యా విహార్ పాఠశాలలో సెంటర్లు ఏర్పాటు చేశారు.ఆయా సెంటర్లకు 8 గంటలకు విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు చేరుకున్నారు. తొలి పరీక్ష కావడంతో తల్లిదండ్రులు వారి పిల్లలు పరీక్ష కేంద్రం లోపలకు వెళ్లే వరకూ వెంట ఉండి,పరీక్ష రాసే విధానంపై పలు సూచనలు చేశారు.

కంచరపాలెం కేంద్రాల్లో సజావుగా ..

కంచరపాలెం: కంచరపాలెం, ఐటీఐ జంక్షన్, మర్రిపాలెం, జ్ఞానాపురం తదితర ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలకు ఉదయం 8 గంటలకే టెన్త్ విద్యార్థులు చేరుకున్నారు. జ్ఞానాపురం పరిధిలో సేక్రెడ్ హార్ట్ బాలికలు, ఏకేఎం జూబ్లీ, సెయింట్ పీటర్స్ బాలుర ఎయిడెడ్ పాఠశాలలు, కంచరపాలెం పరిధిలో రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ హైస్కూల్, ఐటీఐ జంక్షన్ పరిధిలో కప్పరాడ హైస్కూళ్ల సందడి వాతావరణం నెలకొంది. తొలి రోజు తెలుగు పరీక్ష సజావుగా నిర్వహించారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది సేవలు అందజేశారు.


శ్రీహరిపురం జీవీఎంసీ పాఠశాల వద్ద పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు


గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల వద్ద గుమిగూడిన విద్యార్థులు తల్లి దండ్రులు


కప్పరాడ సెంటర్ వద్ద విద్యార్థుల పౌచ్‌లను తనిఖీ చేస్తున్న సిబ్బంది

వినియోగదారుల స్టోర్స్ నిర్వహణపై ఫిర్యాదు


కలెక్టర్ మల్లికార్జునకు ఫిర్యాదు చేస్తున్న మారయ్య

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపో సివిల్ ఎంప్లాయిస్ మ్యూచువల్ ఎయిడెడ్ కన్జూమర్ స్టోర్స్ నిర్వాహకులు నిధులు స్వాహా చేశారని కలెక్టర్ మలికార్జనకు స్పందనలో నేవల్ ఆర్మమెంట్ సివిల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య తదితరులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మారయ్య మాట్లాడుతూ 1999లో ఎన్ఏడీ సీఈ యూనియన్ ద్వారా ఈ కన్జూమర్ స్టోర్ ప్రారంభమైందన్నారు. అప్పటి నుంచి స్టోర్స్ మూసి వేసినంతవరకు కూడా లాభాలతో కొనసాగిందని తెలిపారు. ఈ వ్యాపారంలో వచ్చిన లాభాలతో పాటు సభ్యుల నుంచి వసూలు చేసిన త్రిఫ్ట్ డిపాజిట్లు సైతం వారి స్వప్రయోజనాలకే వాడేశారని ఆరోపించారు. ఇపుడు సంస్థ బోర్డు తిప్పేసి సభ్యులను నట్టేట ముంచేశారని వాపోయారు. దీనిపై కొందరు సభ్యులు, డైరెక్టర్స్‌ను ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని ఆరోపించారు. సంస్థ డైరెక్టర్లతో పాటు నిర్వహకులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డిపాజిట్ సొమ్ము సభ్యులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన సీఐ నర్సింగరావు


గోపాలపట్నం సీఐ నర్సింగరావు

గోపాలపట్నం: గోపాలపట్నం సీఐగా ఈదుల నర్సింగరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సీసీఆర్ బీలో విధులు నిర్వహించి గోపాలపట్నం బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీఐ నర్సింగరావు మాట్లాడుతూ గతంలో గోపాలపట్నం స్టేషన్‌లో పని చేసిన అనుభవం ఉందన్నారు. ఈ ప్రాంతంలో విజువల్ పోలీసింగ్ ద్వారా ప్రజలకు చేరువవుతామని ఆయన తెలిపారు. ప్రధానంగా గంజాయి, డ్రగ్స్, ఓపెన్ డ్రింకింగ్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు.

గాంధీనగర్‌లో కార్పొరేటర్ పర్యటన


గాంధీనగర్‌లో గెడ్డ పరిస్థితిని డీఈకి వివరిస్తున్న కార్పొరేటర్ రమణ

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు గాంధీనగర్‌లో కార్పొరేటర్ బొమ్మిడి రమణ సోమవారం పర్యటించారు. ఆయనతో పాటు డీఈ విజయ్ కుమార్ కూడా పాల్గొన్నారు. శిథిలావస్థకు చేరిన గెడ్డను పరిశీలించి అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు. కార్యక్రమంలో స్థానికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్త దానం చేస్తున్న విశ్రాంత జేడీ లక్ష్మీనారాయణ

గోపాలపట్నం: జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్రాంత జేడీ వీవీ లక్ష్మీనారాయణ పుట్టిన రోజు సందర్భంగా గోపాలపట్నం పిన్నమనేని ఫంక్షన్ హాలులో సోమవారం రక్తదాన శిరం నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ రక్త దానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త దానం చేయడం వల్ల ఎంతో మంది జీవితాలను నిలబెట్టినవారమవుతామన్నారు. నేటి యువకులు రక్తదానం చేయడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపట్నం: విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కోసం 132/33కేవీ సింహాచలం లైన్ పరిధిలోని గోపాలపట్నం, బుచ్చిరాజుపాలెం సబ్ స్టేషన్‌లోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్ఏడీ, బుచ్చిరాజుపాలెం, గాంధీనగర్, ఇందిరాప్రియదర్శిని కాలనీ, బాజీ జంక్షన్, గోపాలపట్నం, నరసింహనగర్, చంద్రనగర్, యల్లపువానిపాలెం, పాత గోపాలపట్నం ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ములగాడలో ఈగల మోత


ఓ ఇంట్లో వంట గదిలో ప్లాస్టిక్ డబ్బాలపై చేరిన ఈగలు


ములగాడ గ్రామంలో అపరిశుభ్ర వాతావరణం

- ఇబ్బంది పడుతున్న ప్రజలు

మల్కాపురం: ఈగ సినిమాలో విలన్ ఈగ వల్ల పడిన అవస్థలు ప్రేక్షకులకు ఇప్పటికీ గుర్తుండే ఉంటాయి. అలాంటి ఇబ్బందులే ములగాడ ప్రాంత వాసులు ఎదుర్కొంటున్నారు. వందల సంఖ్యలో ఈగలు ఇళ్లలోకి చేరి అక్కడి వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇక్కడ ఈగల మోతకు కారణం చుట్టుపక్కల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడమే అని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 58వ వార్డు పరిధి చిన్న ములగాడ ప్రాంతంలో సుమారు 1200 మంది నివాసం ఉంటున్నారు. అయితే వీరంతా ఈగల మోతతో ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోజుల నుంచి పలు ఇళ్లలోకి వందల సంఖ్యలో ఈగలు తిను బండారాలు,వంట పాత్రలు,మంచినీటి గ్లాసులు ఇలా ప్రతి వస్తువుపై వాలుతున్నాయి. పాత్రల్లో ఉన్న పదార్థాలను పాడు చేస్తున్నాయి. మనుషులపై వాలి చికాకు కలిగిస్తున్నాయి.ఇ క్కడ ఈగలు ఇంతగా విజృంభించడానికి ములగాడ పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండటం,వీధి కాలువుల్లో మురుగు నిలిచిచిపోవడమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ఈగల సమస్య పరిష్కారానికి ఏదైనా మందు ఏదైన పిచికారీ చేయడంతో పాటు చెత్త తొలగించే చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

వీధి కుక్కల స్వైరవిహారం

- పలువురిపై దాడి
- బెంబేలెత్తిపోతున్న 61వ వార్డు వాసులు


వీధి కుక్కల దాడిలో గాయపడిన బాలుడు


వీధి కుక్కల దాడిలో గాయపడిన వ్యక్తి


వీధి కుక్కలను పట్టుకున్న సిబ్బంది

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డులోని పలు ప్రాంతాల్లో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దాడులు చేసి స్థానిక వాసులను హడలెత్తిస్తున్నాయి. సోమవారం మల్కాపురం పరిసర ప్రాంతాల్లో రెండు చోట్ల వీధి కుక్కల దాడిలో ఓ వ్యక్తితో పాటు బాలుడు గాయపడ్డారు. వారిని స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిచారు. కుక్కల దాడిలో గాయపడిన వారు వార్డు కార్పొరేటర్ సుధ దృష్టికి సమస్య తీసుకువెళ్లారు. దీంతో ఆమె స్పందించి ఆ ప్రాంతంలో కుక్కలను బంధించాలని ఆదేశించారు. సిబ్బంది సోమవారం మధ్యాహ్నం సమయంలో ఆయా ప్రాంతాలకు వచ్చి కొన్ని కుక్కలను మాత్రమే బంధించారు. మిగిలిన ప్రాంతాల్లోని కుక్కలను కూడా ఏరివేయాలని కోరుతున్నారు.

నేను దళిత పక్షపాతిని

- కార్పొరేటర్ పీవీ సురేష్


కార్యక్రమంలో మాట్లాడుతున్న పి.వి.సురేష్

మల్కాపురం: తాను దళిత పక్షపాతి అని, కొందరు తనపై దళిత వ్యతిరేకి అన్న ముద్ర వేయడం సరి కాదని 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ అన్నారు. వార్డులోని మహత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణ స్థలంలో ఇటీవల ఓ దళిత వ్యక్తికి సంబంధించిన షాపుపై కప్పు తొలగింపు అంశంలో కార్పొరేటర్ సురేష్‌పై కొంత మంది దళిత నాయకులు ఆరోపణలు చేస్తున్న తరుణంలో ఆయన స్పందించారు. సోమవారం సాయంత్రం పలువురు దళిత నాయకులు,కార్యకర్తలతో కలిసి గుల్లలపాలెం వుడాకాలనీ వద్ద సమావేశం నిర్వహించారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను దళిత పక్షపాతినన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా తన ట్రస్టు ఆధ్వర్యంలో నగర నలుమూల పలువురికి సాయం అందించిన చరిత్ర తనదన్నారు. గిట్టని వారు చేస్తున్న తప్పుడు ప్రచారాలను దళిత సోదరులు నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన దళిత కుల సంఘాల సభ్యులుపాల్గొన్నారు.

ఘనంగా పోలమాంబ తొలేళ్ల ఉత్సవం


పోలమాంబ అమ్మవారు

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం స్థానిక మద్దివారివీధిలోని పెద్దిల్లు వద్ద సోమవారం ఘనంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో సురేష్‌బాబా తెలిపారు.

నేడు వార్షిక జాతర

పండగలో భాగంగా ప్రధాన ఘట్టం అనుపు మహోత్సవం, వార్షిక జాతర మంగళవారం జరగనుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆలయాన్ని వివిధ రంగులు పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారిని ఇలవేల్పుగా కొలిచే పెదవాల్తేరు చుట్టుపక్కల 14 గ్రామాల ప్రజలు ఈ పండగకు తరలిరానున్నారు. పోలమాంబ ఆలయంలో పని చేస్తున్న 20 మంది సిబ్బందితో పాటు దేవదాయశాఖకు చెందిన సిబ్బంది 50 మంది వరకు ఉత్సవాల నిర్వహణలో భాగస్వాములవుతున్నారు. భక్తులకు ఉచిత ప్రసాదం, మంచినీరు, మజ్జిగ పంపిణీకి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రాథమిక వైద్య శిబిరం, ప్రసాదాల విక్రయాలకు ప్రత్యేక, అదనపు కౌంటర్లను ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఉచిత, రూ.50, రూ.100, రూ.500 దర్శనాలు అందుబాటులో ఉంచారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పిడింట్ల శంకర్‌రెడ్డి తెలిపారు.

- పోలమాంబ పండగ నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం అదనపు పోలీసు సిబ్బంది ఆలయం వద్దకు చేరుకుని భద్రత చర్యలో భాగమయ్యారు. మూడో పట్టణ సీఐ కోరాడ రామారావు సిబ్బందికి తగిన సూచనలు చేసి, విధులు కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాము, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ కొండా రమాదేవి

మల్కాపురం: తీరిక వేళల్లో మహిళలు సమీపంలోని గ్రంథాలయాలకు వెళ్లి అక్కడ పుస్తక సంపదను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ కొండా రమాదేవి అన్నారు. మల్కాపురం పల్లివీధి వద్ద మంగళవారం బుక్ డిపాజిట్ సెంటర్ (బి.డి.సి)ను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్థానిక మహిళలు ఏర్పాటు చేసిన బుక్ సెంటర్‌ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. పుస్తక పఠనం ద్వారా ఎంతో జ్ఞానం పొందవచ్చున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు దాడి సత్యనారాయణ, నాయకురాలు రేవు జగదాంబ,ప్రముఖ న్యాయవాది విశ్వనాథ్‌రాజు,గ్రంథాలయాధికారి అజేయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంటీపీ కోసం 29 ప్రైవేటు ఆస్పత్రుల దరఖాస్తు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు

మహారాణిపేట: రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ(ఎంటీపీ) సమావేశం డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మొత్తం 29 ప్రైవేటు ఆస్పత్రులు ఎంటీపీ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నాయని, వాటిని పరిశీలిస్తున్నట్టు చెప్పారు. గైనకాలజీ టీం సభ్యులు ఆయా ఆస్పత్రులను సందర్శించి ఎంటీపీకి సంబంధించి వైద్యుల అర్హతలు, పరికరాలు ఉన్నాయో? లేదో? పరిశీలించి నివేదిక ఇస్తారన్నారు. అనంతరం నివేదికపై చర్చించి అనుమతులు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో కేజీహెచ్ గైనాలజిస్ట్ డాక్టర్ ఐ.వాణి, వుమన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బి.ఉమావతి, కేజీహెచ్ మత్తు డాక్టర్ మురళీకృష్ణ, జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) బి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రసవాలపై సమావేశమై చర్చించారు.

మానవత్వం చాటుకున్న ఆనంద్‌కుమార్


వృద్ధుడికి నగదు అందిస్తున్న వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

- సొంత నిధులతో పలువురికి పింఛన్ అందజేత


పింఛను అందిస్తున్న దొడ్డి కిరణ్

సింధియా: పలు కారణాలతో పింఛన్లు రద్దయిన వారికి విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, ఎంఎస్ఎంఈ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ బాసటగా నిలిచారు. పింఛన్లు నిలిచిపోయిన వారికి తన సొంత నిధులతో పింఛన్లు చెల్లిస్తున్నారు. పింఛన్లు ఎందుకు రద్దయ్యాయో తెలుసుకుని అర్హత కలిగిన వారికి తిరిగి ప్రభుత్వం నుంచి పింఛన్ వచ్చే వరకు తన సొంత నిధులతో ప్రతి నెలా పింఛన్లు అందజేస్తున్నారు. జీవీఎంసీ 62వ వార్డు పరిధి అంబేడ్కర్‌కాలనీలో నివాసముంటున్న నిడిగట్ల పైడిరాజు అనే వృద్ధుడికి ఆడారి ఆనంద్‌కుమార్ ప్రతి నెలా తన సొంత నిధుల నుంచి పింఛన్ నగదు అందిస్తున్నారు. ఈ మేరకు సోమవారం వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు వృద్ధుడికి పింఛన్ నగదు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఇటీవల సాంకేతిక కారణాల వల్ల పింఛన్ నిలిచిపోవడంతో విషయాన్ని ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సొంత నిధులతో పింఛన్ అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పెద్దాడ ప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపాలెంలో..

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో జి. కాంతమ్మకు విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ సొంతనిధులతో పింఛను అందిస్తున్నారు. సోమవారం ఆమెకు నగదును వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దొడ్డి కిరణ్ అందించారు. కార్యక్రమంలో నాయకులు ఆళ్ల పైడిరాజు, అయితంశెట్టి గోపి, సచివాలయ కన్వీనర్ శ్రీరామదాసు, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ లెర్నింగ్‌తో మెరుగైన అవగాహన


సాంబశివరావును సత్కరిస్తున్న విభాగ ఆచార్యులు

ఏయూ క్యాంపస్: గ్రూప్ లెర్నింగ్‌తో మెరుగైన అవగాహన కలుగుతుందని ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ ఎస్. సాంబశివరావు అన్నారు. సోమవారం ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో విద్యార్థులనుద్దేశించి ఆయన విశిష్ట ప్రసంగం చేశారు. వార్తా పత్రికల్లో ఎడిటోరియల్ పేజీ ఎంతో ప్రధానమన్నారు. దీనిని చదవడం వల్ల విభిన్న అంశాలపై లోతైన అవగాహన ఏర్పడుతుందని, పోటీ పరీక్షల సమయంలో ఇది ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందని చెప్పారు. నిర్దిష్ట విధానాలు అమలు చేస్తూ సంక్షేమ పథకాలు అందరికీ అందించాలన్నారు. పరీక్షలకు సన్నద్ధం అయ్యే విధానం , అవకాశాలు తదితర అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, విభాగాధిపతి ఆచార జాలాది రవి, ఆచార్య పి.విశ్వనాథం, ఆచార్య జి.సుదర్శన్‌రావు, రిటైర్డ్ ప్రొఫెసర్ డి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంబశివరావును విభాగం తరపున సత్కరించారు.